www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 14 ఆగస్టు 2023



చిన్నవెంకన్న సన్నిధిలో ఆక్టోపస్ బృందాల మాక్ డ్రిల్

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ప్రముఖ క్షేత్రం చినవెంకన్న ఆలయ ప్రాంగణంలో ఆక్టోపస్ బృందాలు ఆదివారం మాక్‌డ్రిల్ నిర్వహించాయి. ఆలయ పరిసరాలు, లోపలి భాగంలో ఉగ్రవాదుల చరనుండి యాత్రికుల రద్దీ సమయంలో, అర్ధరాత్రి సమయంలో, ఇతర సమయాల్లో వారు ఎలాంటి జాగ్రత్తలు, రక్షణ చర్యలు తీసుకోవాలో డెమో చేసి చూపించారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ఆలయాన్ని ఉగ్రవాదులు, టెర్రరిస్టుల నుంచి ఆలయానికి సంబంధించిన సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉండటంతో ఈ ఆక్టోపస్ బృందం మాక్ డ్రిల్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ వేండ్ర త్రినాధరావు, సంబంధిత అధికారులు, ఇంజినీరింగ్ విభాగం వారు పాల్గొన్నారు.


ఆలయంలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న బృందం

'పొత్తు' పొడిచేనా..!

ఎన్నికల పొత్తులపై రాజకీయ నేతల్లో చర్చ
టిడిపి, జనసేనలపై ప్రజల సమాలోచనలు
పొత్తు కుదిరితే సీట్ల పంపకంపైన ఊహాగానాలు
జనసేన వారాహి యాత్రతో కార్యకర్తల్లో మరింత ఉత్సాహం



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏడాదిలోపే అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటంతో ఎన్నికల పొత్తులపై జిల్లా రాజకీయాల్లో చర్చలు మొదలయ్యాయి. ముఖ్యంగా టిడిపి, జనసేన పొత్తుపై ఆయా పార్టీనాయకులతో పాటు జనాల్లోనూ తీవ్ర చర్చ కొనసాగుతోంది. గ్రామ, పట్టణాల్లో ఏ ఇద్దరు కలిసినా టిడిపి, జనసేన పొత్తుగురించి మాట్లాడుకుంటున్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ జిల్లాలో చేపట్టిన మొదటివిడత వారాహి యాత్ర ఆపార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపినట్లు కనిపిస్తోంది. ఆ పార్టీ నాయకులు వివిధ కార్యక్రమాలను వేగవంతం చేశారు. ఇటీవల అడవికొలను, నిడమర్రు రోడ్డు గురించి ఆ పార్టీ నాయకులు చేపట్టిన పాదయాత్ర అంతటా చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల్లో పొత్తు కుదరకపోతే టిడిపి, జనసేన ఇరు పార్టీలూ నష్టపోతాయని, పొత్తు కుదిరితే జిల్లాలో అన్నిసీట్లు గెలుచుకునే అవకాశం ఉంటుందని ఇరుపార్టీల నాయకులు అంచనా వేస్తున్నారు. అదేసమయంలో పొత్తుకుదిరితే జనసేనకు ఏయే సీట్లు ఇస్తారన్న అంశంపైనా జనాల్లో చర్చ నడుస్తోంది. రెండు జిల్లాల్లోనూ 14 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలున్నాయి. 2014 ఎన్నికల్లో టిడిపి, బిజెపి, జనసేన పొత్తుతో ముందుకు సాగాయి. జనసేన ప్రత్యక్షంగా అభ్యర్థులను పోటీకి దింపకపోయినా టిడిపికి అండగా నిలిచింది. దీంతో ఉమ్మడిజిల్లాలోని 15 సీట్లను టిడిపి కైవసం చేసుకుంది. పొత్తులో భాగంగా తాడేపల్లిగూడెం అసెంబ్లీ, నరసాపురం ఎంపీస్థానాల్లో బిజెపి అభ్యర్థులు గెలిచారు. 2019లో పొత్తులేకుండా టిడిపి, జనసేన , బిజెపి ఒంటిరిగా ఎన్నికల బరిలోకి దిగాయి. దీంతో 15 స్థానాలకుగాను వైసిపి 13 స్థానాలను గెలుచుకోగా, టిడిపి రెండుస్థానాలకే పరిమితమైంది. జనసేన ఒక్కసీటు కూడా గెలుచుకోలేదు. భీమవరం స్థానంలో పోటీచేసిన జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ సైతం ఓటమిపాలయ్యారు. నరసాపురం, తాడేపల్లిగూడెం, భీమవరం వంటి స్థానాల్లో జనసేన అభ్యర్థులు రెండోస్థానంలో నిలిచినప్పటికీ గెలుపుమాత్రం సాధించలేకపోయారు. ఓట్లు విడిపోవడం కారణంగా వైసిపికి అత్యధిక సీట్లు వచ్చాయని టిడిపి, జనసేన నాయకులు అంచనా వేశారు. ఈసారి పొత్తుతోనే ఎన్నికల బరిలో దిగాలని జనసేన భావిస్తోంది. అందుకు తగినట్లుగానే జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ సంకేతాలు ఇస్తూ వస్తున్నారు. ఉమ్మడి పశ్చిమలో కాపు సామాజిక తరగతి జనాభా ఎక్కువగా ఉంది. కాపు సామాజిక తరగతి ఈసారి జనసేన వైపు నిలిచే అవకాశం ఉన్నట్లు లెక్కలు కడుతున్నారు. దీంతో పొత్తుపెట్టుకుంటే రెండు జిల్లాల్లోని 14 అసెంబ్లీ స్థానాలను గెలుచుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. రోడ్ల వేయకపోవడం, తాగునీరు గురించి పట్టించుకోకపోవడం, చెత్తపన్ను, విద్యుత్ బిల్లుల పెంపు, ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు వంటి అనేక అంశాలను అధికార పార్టీ వైసిపికి ఇబ్బందిగా మారే పరిస్థితి కనిపిస్తోంది.

జనసేన పోటీ ఏయే స్థానాల్లో?

పొత్తు కుదిరితే జనసేన జిల్లాలో ఐదుస్థానాల్లో పోటీచేసే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. నరసాపురం, తాడేపల్లిగూడెం, భీమవరం, ఉంగుటూరు, ఏలూరు నుంచి పోటీ చేయనున్నట్లు ప్రచారం సాగుతోంది. గత ఎన్నికల్లోనూ ఈ స్థానాల్లో జనసేన తన ప్రభావం చూపించింది. అయితే ఆయా స్థానాల్లో టిడిపి బలమైన అభ్యర్థులున్నారు. జిల్లా టిడిపి అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు ఉంగుటూరుకు, ఏలూరుకు బడేటి బుజ్జి సోదరుడు చంటి, తాడేపల్లిగూడెంకి ముళ్లపూడి బాపిరాజు వంటి సీనియర్ నాయకులున్నారు. పొత్తులో ఈ సీట్లు జనసేనకు ఇస్తే రాజకీయంగా ఇబ్బందులు వచ్చే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో పొత్తు కుదిరితే సీట్ల సర్దుబాటు ఏవిధంగా ఉంటుందోనన్న చర్చ సర్వత్రా నడుస్తోంది. ఏది ఏమైనా టిడిపి, జనసేన పొత్తుఖాయమన్న రీతిలో ఆయా పార్టీల నాయకులు చెబుతున్న పరిస్థితి నెలకొంది. పొత్తు పొడుస్తుందో లేదో వేచిచూడాల్సి ఉంది.

బాలలకు రక్ష.. మిషన్ వాత్సల్య

ఉమ్మడి జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సూర్యచక్రవేణి



ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను, బాలలతో భిక్షాటనను, బాల్య వివాహాలను, బాలల అక్రమ రవాణాను అరికట్టేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సిహెచ్.సూర్య చక్రవేణి తెలిపారు. ఈ సంవత్సరంలో ఇప్పటివరకూ ఎంతమంది బాల కార్మికులను గుర్తించారు, ఎన్ని బాల్య వివాహాలను అడ్డుకున్నారు, బాలల సంరక్షణకు ఎలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు వంటి ప్రశ్నలకు ప్రజాశక్తి ముఖాముఖిలో ఆమె సమాధానాలిచ్చారు.

ప్రశ్న : మహిళా శిశు సంక్షేమ శాఖలో బాలల సంరక్షణ అధికారి ముఖ్య విధులు ఏంటి?

ముఖ్యంగా 18 ఏళ్లలోపు బాలబాలికలకు ఇంటిలో, బడిలో, సమాజంలో ఏ కష్టం వచ్చినా బాల న్యాయ చట్టం ప్రకారం వారికి న్యాయం చేయడం, వారి హక్కులను కాలరాసే వారిపై చర్యలు తీసుకోవడం మా శాఖ యొక్క ముఖ్య ఉద్దేశం. ఇందుకోసం మిషన్ వాత్సల్య పేరుతో ప్రత్యేక కార్యక్రమం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహించబడుతుంది.



ప్రశ్న : బాలకార్మికుల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు ఏమైనా తీసుకుంటున్నారా? ఇప్పటివరకూ ఈ సంవత్సరం ఎంతమంది బాల కార్మికులను గుర్తించారు?

బాల కార్మికుల నిర్మూలనకు నెల రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాము. ఈ డ్రైవ్ లో భీమవరం, ఏలూరు ప్రాంతాల నుంచి 36 మంది బాలకార్మికులను గుర్తించి వారిని వివిధ పాఠశాలల్లో చేర్పించడం జరిగింది. కార్మిక శాఖ వీరిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వీరి బాగోగులు చూడటం జరుగుతుంది.

ప్రశ్న : బాల్యవివాహాల నిరోధానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? ఈ సంవత్సరం ఎన్ని బాల్యవివాహాలను నిలుపుదల చేసి, కేసులు నమోదు చేశారు?

బాల్య వివాహాల నిరోధాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఇటీవల జిఒ31ని విడుదల చేశారు. జిల్లా కలెక్టర్ ఆర్‌డిఒ నోడల్ అధికారులుగా ఉండి నెలనెలా ఈ కార్యక్రమంపై సమీక్ష చేయటం జరుగుతుంది. అలాగే గ్రామాల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారి, మహిళా సంరక్షణ కార్యదర్శి ఎప్పటికప్పుడు ఆయా గ్రామాల్లో సమాచారాన్ని సేకరించి 18 సంవత్సరాలలోపు బాల బాలికలు కచ్చితంగా చదువుకునేలా చర్యలు తీసుకుంటున్నాము. ఈ సంవత్సరం ఏప్రిల్ నుంచి 19 బాల్య వివాహాలను గుర్తించాము. ఐదు వివాహాలపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశాము.

ప్రశ్న : జిల్లాలో ఇప్పటి వరకూ ఎన్ని పోక్సో కేసులు నమోదు చేశారు?

ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకూ 12 పోక్సో కేసులు నమోదు చేశాము. పోలీస్ డిపార్ట్‌మెంట్ ద్వారా ఆ కేసులను పోలీసు శాఖ ద్వారా చేపట్టాము.

ప్రశ్న : ఈ సంవత్సరం ఎంతమంది పిల్లలను దత్తత ఇచ్చారు? దత్తత తీసుకోవాలంటే ఎలాంటి నిబంధనలుంటాయి?

జిల్లాలో ఈ సంవత్సరం ఎనిమిది మంది పిల్లలను దత్తత ఇచ్చాము. పిల్లలను దత్తత తీసుకోవాలంటే ముందుగా ఎవరైతే పిల్లలు కావాలని అనుకుంటున్నారో వారి వివాహ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, వయస్సు, ఆదాయం, ఆరోగ్య పరిస్థితి తదితర డాక్యుమెంట్లు ఆన్‌లైన్లో రిజిస్టర్ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఏ ఏజెన్సీ నుంచి పిల్లలను దత్తత తీసుకోవాలని అనుకుంటున్నారో ఆ ఏజెన్సీని సెలెక్ట్ చేసుకోవాలి. వారి డాక్యుమెంట్లు మాకు అందిన తర్వాత 30 రోజుల్లో వారి ఇంటికి వెళ్లి అన్నివివరాలు విచారించి సరిగ్గా ఉంటే మళ్లీ మేము ఆ వివరాలను సంబంధిత పోర్టల్‌లో అప్లోడ్ చేస్తాము. ఆ తర్వాత సీనియార్టీ ప్రకారం వారివంతు వచ్చినప్పుడు వారికి కబురు చేసి, వారు వచ్చి చూసుకుని పిల్లల నచ్చితే తాత్కాలికంగా వారికి అప్పగిస్తాము. తరువాత 60 రోజుల్లో వారు జిల్లా కలెక్టర్ ముందు హాజరైతే అన్నీ చూసుకుని సరిగ్గా ఉంటే వారికి పర్మినెంట్‌గా దత్తత ఇస్తాము.

ప్రశ్న: 6 నుంచి 18 ఏళ్లలోపు పిల్లలను సంరక్షించే బాలసదనాలు జిల్లాలో ఎక్కడెక్కడ ఉన్నాయి? వారిని ఎవరు దత్తత తీసుకోవడానికి ముందుకు రాకపోతే వారిని ఏం చేస్తారు?

జిల్లాలో బాలసదనాలు దెందులూరు నూజివీడు తణుకు ఆకివీడు ప్రాంతాల్లో ఉన్నాయి. పెద్ద పిల్లలను ఎవరు దత్తత తీసుకోకపోవడానికి ముందుకు రాకపోతే వారిని కస్తూరిబా బాలిక పాఠశాలల్లో చదివించడం జరుగుతుంది. చదువుతోపాటు వివిధ నైపుణ్య శిక్షణ ఇచ్చి వారికి ఉద్యోగం వచ్చేవరకూ మేమే సంరక్షించడం జరుగుతుంది. ఉద్యోగం వచ్చిన తర్వాత వారికి ఇష్టం అయితే మేమే వివాహం కూడా చేయడం జరుగుతుంది. లేకపోతే వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్లో ఉంచి పర్యవేక్షించడం జరుగుతుంది.

ప్రశ్న : జిల్లాలో ఇటీవల బాలల భిక్షాటన ఎక్కువగా కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో వారిని అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? ఇప్పటివరకూ ఎంతమందిని గుర్తించారు?

బాలల భిక్షాటన అరికట్టేందుకు పోలీస్ డిపార్ట్‌మెంట్‌తో కలిసి అప్పుడప్పుడు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పోలీస్ డిపార్ట్‌మెంట్‌తో పాటు విద్యాశాఖ కూడా బాధ్యతవహించి బాలల భిక్షాటనను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించాము. జిల్లాలో ఇప్పటివరకూ 40 మందిని గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించాము.

ప్రశ్న : బాల కార్మికవ్యవస్థ, బాల్య వివాహాలు, బాలల భిక్షాటనను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు చివరిగా ప్రజలకు మీరిచ్చే సూచన ఏంటి?

మన దేశంలో ప్రతి పౌరుడికీ హక్కులున్నట్టే బాలలకు కూడా కొన్ని ప్రత్యేక హక్కులున్నాయి. బాలలు ఎట్టి పరిస్థితుల్లోనూ బడిబయట ఉండకూడదు. బాలలతో భిక్షాటన చేయించటం, బాలలను పనిలో పెట్టుకోవడం, బాల్యవివాహాలు చేయడం నేరం. దీన్ని అరికట్టడం ప్రతి పౌరుడూ తమబాధ్యతగా అనుకోవాలి. ఎక్కడైనా ఇలాంటి సంఘటనలు కనిపిస్తే 1098 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారమిస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. గతంలో ఈ నంబరు ఎన్‌జిఒ అధీనంలో ఉండేది. ఇప్పుడు మా శాఖ అధీనంలోకి వచ్చింది కాబట్టి ఎవరైనా సమాచారమిస్తే ఖచ్చితంగా చర్యలు తీసుకుని బాలల హక్కులు కాపాడేందుకు పూర్తిస్థాయిలో ప్రయత్నిస్తున్నాము.

అసైన్డ్ చట్ట సవరణతో పేదలకు నష్టం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీతారాం



మాట్లాడుతున్న మంతెన సీతారాం

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వం పేదలకు నష్టం కలిగేలా అసైన్డ్ భూముల చట్ట సవరణ ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం విమర్శించారు. వెంటనే ఈ చట్ట సవరణను నిలుపుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక పవర్‌పేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీతారాం మాట్లాడుతూ అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పించడం వల్ల భూస్వాములకు, పెత్తందారులకు ప్రయోజనం జరుగుతుందని, పేదలు నష్టపోతారని తెలిపారు. అసైన్మెంట్ భూములు పంపిణీ చేయాలన్నప్పుడు లబ్ధిదారులను అసైన్మెంట్ కమిటీలో నిర్ణయించాల్సి ఉన్నా దానికి భిన్నంగా చేయడాన్ని తప్పుబట్టారు. గ్రామ సచివాలయాల వద్ద అసైన్మెంట్ భూముల ఆక్రమణదారుల పేర్లు బహిర్గతపరచాలన్నారు. పెత్తందారులకు, భూస్వాములకు యాజమాన్యం హక్కులు కల్పించడం వల్ల అధికార పార్టీ నేతలే ప్రయోజనం పొందుతారని ఆందోళన వ్యక్తం చేశారు. అసైన్మెంట్ భూములు పంపిణీ చేయాలన్నప్పుడు లబ్ధిదారుల్ని అసైన్మెంట్ కమిటీలో నిర్ణయించాలని డిమాండ్ చేశారు. తక్షణం కమిటీలు వేసి చర్చించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గతేడాది హడావుడిగా పేదల భూ పంపిణీకి చేసిన పనిలోనే పెత్తందారులు ఒక వ్యూహం ప్రకారం రాష్ట్రంలో వేలాది ఎకరాలు భూస్వాములు తమ ఆధీనంలో తెచ్చుకున్నారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న భూదందా జాబితాలో అసైన్డ్ భూములు చేరిపోతున్నాయని, దీనివల్ల దళిత, గిరిజనులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో 1954 తర్వాత పేదలకు భూపంపిణీ చేసి అసైన్డ్ భూములపై 20 ఏళ్ల కాలపరిమితి విధించే యాజమాన్య హక్కులు కల్పించేందుకు మంత్రివర్గం ఆమోదముద్ర వేయడం ఆందోళన కలిగిస్తోందన్నారు. పేదలకు జీవనాధారంగా ఉన్న ఈ భూముల సాగుకు అవసరమయ్యే విధంగా సౌకర్యాలు కల్పించాలని కోరారు. వ్యవసాయానికి అనుకూలంగా లేకపోతే ఈ భూములను భూస్వాములు, పెట్టుబడిదారులు పేదల నుండి దౌర్జన్యంగా బలవంతంగా లాక్కొని అమ్ముకోవడం కోసం ప్రయత్నం చేస్తున్నారన్నారు. వాటిలో వందలాది ఎకరాల్లో ఫ్యాక్టరీలు కడుతున్నారని, దీనికోసం ప్రభుత్వం పేదల నుండి భూములు లాక్కుంటుందని తెలిపారు.

సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ జిల్లాలో లక్షలాది ఎకరాల అసైన్మెంట్ భూములు స్థానికేతర భూస్వాములు, స్థానిక భూస్వాముల చేతుల్లోనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భూములను బినామీల పేర్లతో దర్జాగా అనుభవిస్తున్నారని తెలిపారు. ఉదాహరణకు దెందులూరు మండలంలో దోసపాడు, కొవ్వలి, పోతునూరు గ్రామాల్లో సుమారు 150 ఎకరాలకుపైగా అసైన్మెంట్ భూములను స్థానికేతర భూస్వాములు, స్థానిక భూస్వాములు కుమ్మక్కై చేపలు, రొయ్యల చెరువులు తవ్వి దర్జాగా అనుభవిస్తున్న రెవెన్యూ శాఖ అధికారులు, జిల్లా జాయింట్ కలెక్టర్ పట్టించుకోకపోగా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గత ఏడాది నుంచి దోసపాడులో దళితులు, పేదల భూముల కోసం పోరాడుతున్న భూస్వాముల చేతుల్లో ఉన్న భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పేదలకు పంచాలని కోరుతున్నా అధికారులు మొద్దు నిద్రపోతున్నారని విమర్శించారు. దీనిపై 15 ఏళ్ల నుండి పోరాడుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. ఈ జిల్లాలో టి.నరసాపురం, చింతలపూడి, లింగపాలెం, పెదవేగి, నూజివీడు నియోజకవర్గం, జంగారెడ్డిగూడెం ప్రాంతాల్లో లక్షలాది ఎకరాల అసైన్మెంట్ భూములు నేటికీ భూస్వాముల ఆక్రమణలోనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భూములపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న అసైన్డ్ భూముల చట్టచవరణ వల్ల పేదలకు, దళితులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు. ఈ నిర్ణయం వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శవర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, ఆర్.లింగరాజు, పి.కిషోర్, జి.రాజు, మొడియం నాగమణి, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ బి.సోమయ్య, ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ, టి.దుర్గారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డి.రమాదేవి

శ్రామిక హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సమాజంలో సగభాగమైన శ్రామిక మహిళల హక్కులకు ఐక్యఉద్యమాలకు సిద్ధం కావాలని శ్రామిక మహిళ సమన్వయ కమిటీ (సిఐటియు) రాష్ట్ర నాయకురాలు డి.రమాదేవి పిలుపునిచ్చారు. ఏలూరు సిఐటియు జిల్లా ఆఫీసులో ఆదివారం జరిగిన శ్రామిక మహిళా జిల్లా సదస్సులో దయా రమాదేవి మాట్లాడారు. సమాజంలో సగభాగమైన మహిళలకు నేటికీ సమాన వేతనాలు అమలు కావడం లేదని, దీనికి ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు. పని ప్రదేశాల్లో ప్రభుత్వ, ప్రయివేటు అనే తేడాలు లేకుండా అనేక చోట్ల మహిళల వేధింపులకు గురవుతున్నారని, మహిళలపై జరుగుతున్న వేధింపులు, హింసను అరికట్టేందుకు లైంగిక వేధింపుల ఫిర్యాదుల కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పథకాలను అమలు చేస్తూ ప్రజలకు అనేక సేవలందిస్తున్న ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథం, మెప్మా, వర్కర్లను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనాలు అమలు చేయాలని కోరారు. పట్టణాలు, నగరాల్లో అభివృద్ధి చెందుతున్న షాప్స్ అండ్ మాల్స్, ఇతర వ్యాపార సంస్థల్లో పనిచేస్తున్న శ్రామిక మహిళలు కూరుని పనిచేసే విధంగా, కేరళ తమిళనాడు తరహా సీట్ అండ్ వర్క్ చట్టం తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ కార్యదర్శి కె.సుభాషిణి, సుధారాణి దుర్గాంబ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రయివేటురంగాల్లో పనిచేస్తున్న శ్రామిక మహిళలకు వేతనంతో కూడిన మేటర్నిటీ సెలవులను కల్పించాలని, పని ప్రదేశాల్లో తాగునీరు, టాయిలెట్లు ఏర్పాటు చేయాలని, మహిళలకు కనీస సౌకర్యాలను కల్పించని సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కె.పోసమ్మ మాట్లాడుతూ ఇంటిపనివారుగా పనిచేస్తున్న మహిళలకు వారాంతపు సెలవు ఇవ్వాలని, యజమానుల నుండి రక్షణ కల్పించాలని, ఇంటి పనివారల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. వీధి వ్యాపారులకు సబ్సిడీతో కూడిన బ్యాంకు రుణాలను అందించాలని పోలీసులు, మున్సిపల్, పంచాయతీ అధికారుల వేధింపులు అరికట్టాలని డిమాండ్ చేశారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి శ్రామిక మహిళలు పెద్దఎత్తున సదస్సుకు హాజరయ్యారు. ఈ సదస్సుకు ఎం.నాగమణి, చెల్లెమ్మ, పి.వెంకటరమణ అధ్యక్షత వహించారు. శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ కె.విజయలక్ష్మి రిపోర్టును ప్రవేశపెట్టారు. సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న శ్రామిక మహిళలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అనేక సంవత్సరాలుగా ప్రభుత్వ స్కూల్స్‌లో పనిచేస్తున్న స్కూల్ స్వీపర్లకు నేటికీ అరకొర జీతాలే ఇస్తున్నారని, కనీస వేతనాలు అమలు చేసి, వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సుకు ఎస్‌కె.సుభాషిణి స్వాగతం పలికారు. ఈ సదస్సులో నాయకులు బిజె ఎం.కుమారి, మాణిక్యం, రాజకుమారి, ఆదిలక్ష్మి, హైమావతి, కామేశ్వరి, మేరీ, లక్ష్మి, సరోజని పాల్గొన్నారు.

'రెడ్‌క్రాస్'కు రూ.లక్ష విరాళం

ఏలూరు అర్బన్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఏలూరు జిల్లా శాఖకు శ్రీమన్నారాయణ ఛారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ వాగ్వాల చంటి లక్ష రూపాయల చెక్కును విరాళంగా రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డికి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ నగదును ముఖ్యంగా తలసేమియా చిన్నారులకు ఉపయోగిస్తామన్నారు. ఈ సందర్భంగా శ్రీమన్నారాయణ ఛారిటబుల్ ట్రస్ట్ యాజమాన్యానికి రెడ్‌క్రాస్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్‌సభ్యులు కె.భాస్కరరావు, కెఎస్‌కె.యశస్వి, కెకె.మనోజ్ఞ పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

స్వాతంత్ర్య సమరయోధులను స్మరించడం మన విధి

ప్రజాశక్తి - భీమడోలు

స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవడం మన విధీ అని, వారు చేసిన త్యాగాలు కారణంగానే మనం స్వేచ్ఛావాయువులను పీల్చుకుంటున్నామని ఉపాధి హామీ చట్ట రాష్ట్ర చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్ డి.పార్వతి అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా భీమడోలు మండలంలో కొనసాగుతున్న నా భూమి - నాదేశం, నేల తల్లికి నమస్కారం-వీరులకు వందనం కార్యక్రమం అమలు తీరును పరిశీలనకు ఆదివారం మండలానికి వచ్చిన ఫైనాన్స్ ఆఫీసర్ భీమడోలు, పూళ్ల గ్రామాలలో కొనసాగుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే ఏర్పాటు చేసిన శిలాఫలకాల వద్ద మట్టి దీపాలతో ప్రజలతో కలిసి పంచప్రాణ్ ప్రతిజ్ఞ చేశారు. ఈ ప్రతిజ్ఞలోని అంశాల వారీగా వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. వసుధకు వందనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ నేపథ్యంలో గత కరోనా కాలంలో విశేష సేవలందించిన భీమడోలు ఎంపిటిసి ముళ్లగిరి జాన్సన్ వైసిపి ప్రముఖులు రామకుర్తి నాగేశ్వరరావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ చైతన్య యువజన సంఘం అధ్యక్షులు డాక్టర్ పి.మాన్‌సింగ్ పాల్గొన్నారు. ఇదేవిధంగా పూళ్ల పరిధిలో కొనసాగిన కార్యక్రమాన్ని పరిశీలించిన అనంతరం భీమడోలు తరహాలో విశేషసేవలందించిన పంచాయతీ సిబ్బంది కృష్ణ, ఎఎన్ఎం.ప్రమీలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దాయం సుజాత ప్రసాద్, గ్రామపంచాయతీ కార్యదర్శి సూర్యకుమార్ పాల్గొన్నారు.


సర్క్యులర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు

జంగారెడ్డిగూడెం: వచ్చేనెల ఐదో తేదీన జరిగే ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేయనున్నట్టు లైన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ గట్టి మాణిక్యాలరావు తెలిపారు. ఆదివారం స్థానిక సిజిఆర్ టౌన్ హాల్లో ఉపాధ్యాయుల అవార్డుల ఎంపిక నిమిత్తం రూపొందించిన మార్గదర్శకాల సర్క్యులర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో లయన్స్ క్లబ్ ద్వారా నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలకు జిల్లా ఛైర్‌పర్సన్‌గా పంతగాని వెంకన్నను నియమించినట్లు తెలిపారు. యూత్ యాక్టివిటీస్‌తో పాటు వెంకన్నకు అదనంగా గురుపూజోత్సవ వేడుకలు నిర్వహించే బాధ్యతను అప్పగించామన్నారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ అవార్డులకు ఎంపికయ్యే ఉపాధ్యాయులు కనీసం 10 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసి ఉండాలన్నారు. జిల్లాలోని లయన్స్ క్లబ్‌ల ద్వారా ఉపాధ్యాయులు తమ వివరాలు పంపాలన్నారు. అవార్డుల ఎంపిక నిమిత్తం ప్రత్యేకంగా ఒక కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఉపాధ్యాయులు తమ సర్వీస్ కాలంలో చేసిన సేవా కార్యక్రమాలు ఈ కమిటీకి అందజేయాలన్నారు. అవార్డుల ఎంపిక ప్రక్రియలో కమిటీదే తుది నిర్ణయం అన్నారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం లైన్స్ క్లబ్‌కు జిల్లా డైరెక్టరీలు గవర్నర్ మాణిక్యాలరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వీస్ కోఆర్డినేటర్ సిహెచ్ అవినాష్ రాజు, రీజనల్ ఛైర్‌పర్సన్ మల్లికార్జున రావు, మద్దుకూరి శ్రీహరి, జోన్ ఛైర్‌పర్సన్ కృష్ణంరాజు, జంగారెడ్డిగూడెం క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతరావు, పండు పాల్గొన్నారు.

21న భవన నిర్మాణ కార్మికుల ధర్నా జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఈనెల 21వ తేదీన ఏలూరు కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే భవన నిర్మాణ కార్మికుల ధర్నాను జయప్రదం చేయాలని ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ నాయకులు తీయ్యల గణేష్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఏరియా ప్రైయివేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం ధర్మన్న స్మారక భవనంలో కోట శివకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో గణేష్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డెత్, డెలివరీ హాస్పిటలైజేషన్, క్లైయిమ్స్ పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21 సోమవారం ఏలూరు కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం ఐఎఫ్‌టియు అనుబంధం ఆధ్వర్యంలో ధర్నా జరుగుతుందని తెలిపారు. ఈ ధర్నాకు అధిక సంఖ్యలో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వనపర్ల నవీన్, బాలిన ధర్మరాజు, ఆవుల పుల్లారావు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం డిఎస్‌పికి పురస్కారం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం డిఎస్‌పి మల్లెల ధనుంజయుడు ప్రతిభ పురష్కారం అందుకోనున్నారు. కేంద్ర హోంశాఖ నుంచి ప్రసంశలు పొందారు. నేర పరిశోధనలో అత్యుత్తమ ప్రతిభ, వృత్తిపరమైన ప్రమాణాలు పాటించడంతో కేంద్ర హోంశాఖ మంత్రిత్వ పరిశోధనా, ప్రతిభ పథకానికి ఎంపికైనట్లు పోలీస్ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. డిఎస్‌పి ధనుంజయుడుకు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో సిబ్బంది, స్థానిక ప్రముఖులు శుభాకంక్షలు తెలిపారు. త్వరలో ఢిల్లీలో నిర్వహించే కార్యక్రమంలో డిఎస్‌పి ధనుంజయుడు ప్రతిభ పురష్కారాన్ని అందుకోనున్నారు.


డిఎస్‌పిని అభినందిస్తున్న సిబ్బంది

కుట్టు మిషన్లు అందజేత

ప్రజాశక్తి - ఏలూరు

మానవసేవే మాధవ సేవగా భావించి కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడంలో ముందుంటామని నిస్వార్థ ఫౌండేషన్ అధ్యక్షులు కె.ప్రశాంత్ తెలిపారు. స్ఫూర్తి వికలాంగుల సహాయ సంఘం ఆధ్వర్యంలో నిస్వార్థ ఫౌండేషన్ అధ్యక్షులు ప్రశాంత్ ముగ్గురు వికలాంగులకు కుట్టు మిషన్లు అందజేశారు. ఏలూరులోని యాపిల్ దయాగ్నోస్టిక్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వికలాంగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాల నుంచి నిర్విరామంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కరోనా సమయంలో నిరంతరం ప్రతిరోజూ పేదలకు అండగా నిలిచామన్నారు. స్ఫూర్తి వికలాంగుల సహాయ సంఘంలో ఎంతో మంది విభిన్న ప్రతిభావంతులు ఉన్నారని, వారి సంక్షేమానికి దాతలు ముందుకు రావాలని కోరారు. అడిగిన వెంటనే స్పందించి ముగ్గురు వికలాంగులకు కుట్టు మిషన్లు అందజేసిన ప్రశాంతను ఆమె అభినందించారు.

రంగా విగ్రహం ధ్వంసంపై ధర్నా

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని సానా రుద్రవరంలోని రంగా విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్రీయ రహదారిపై రంగా అభిమానులు, జనసేన అభిమానులు ధర్నా నిర్వహించారు. గుర్తుతెలియని వ్యక్తులు రంగా విగ్రహాన్ని ముఖం, చేతులపై కొట్టి ధ్వంసం చేయడం దారుణమన్నారు. విగ్రహం కూల్చి వేతకు ప్రయత్నించిన వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని గ్రామంలో ధ్వంసం చేయడం పరిపాటిగా మారిందన్నారు. దోషులను శిక్షించే వరకు ఆందోళన కొనసాగిస్తామని జనసేన నియోజక వర్గ నాయకులు నల్లగోపుల చలపతి రావు తెలిపారు. కైకలూరు టౌన్ సిఐ రఘు, కలిదిండి ఎస్ఐ ప్రియకుమార్ సంఘటనా స్థలానికి తన సిబ్బందితో చేరారు. ట్రాఫిక్‌కి అంతరాయం లేకుండా పలుమార్లు ప్రయత్నించారు. ఆందోళనకారులు ధర్నా కొనసాగిస్తుండడంతో అదనపు పోలీస్ సిబ్బంది మోహరించారు. కైకలూరు నియోజక వర్గ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరి ధ్వంసమైన విగ్రహాన్ని పరిశీలించి, విగ్రహం ధ్వంసం చేయడం వికృత చర్య అన్నారు. విగ్రహం ధ్వంసం చేసిన వారు ఎవరైనా, ఎంతటివారైనా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. శాంతియుతంగా సమస్య పరిష్కరిద్దామని, ట్రాఫిక్‌కి అంతరాయం కలిగించవద్దని కోరడంతో పరిస్థితి సద్దుమణిగింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. నూతన విగ్రహ ఏర్పాటుపై రంగా అభిమానులతో చర్చలు జరిపారు.

అన్నప్రాసన వేడుకకు టిటిపి నేత శ్రీనివాసరావు

ప్రజాశక్తి - చాట్రాయి

చాట్రాయి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు రాయవరపు పుల్లారావు ముద్దుల మనవడు మేఘాన్ష్ అన్నప్రాసన కార్యక్రమానికి ఏలూరు జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కృష్ణారావు పాలెం గ్రామ సర్పంచి చిమట బోయిన పుల్లారావు, గవర వెంకటేశ్వరరావు, తాళ్లూరి యాలాద్రి, సత్యం పాల్గొన్నారు.



కాలిబాట వంతెనను ప్రారంభించిన ఎంపీ, ఎంఎల్ఎ

సొంత నిధులతో వంతెన నిర్మాణం

ప్రజాశక్తి - ఉంగుటూరు

కాగుపాడులో కాలువ మీదుగా కాలిబాట వంతెనను రూ.8 లక్షలతో సాడే రాజమోహన్, రూ.3లక్షలతో కాలువ రేవును కడియాల జానకీ రాంలు సొంత నిధులతో నిర్మించారు. వాటిని ఏలూరు ఎంపి కోటగిరి శ్రీధర్, ఎంఎల్ఎ వాసు బాబు చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించారు. కాలువపై వంతెన లేకపోవడం వల్ల గ్రామస్తులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో దాతల సొంత ఖర్చులతో బెయిలీ వంతెన తరహా కాలిబాట నిర్మించారు. సర్పంచి కడియాల సుదేష్ణ, ఎంపిపి గంట శ్రీలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యురాలు జయలక్ష్మి, మండల నాయకులు మంగారావు, పాపారావు బాబ్జి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వంకిన భారతి, దావీదు, దద్దనాల సాంబశివరావు, మట్టా వెంకటేశ్వరరావు, పెంటపాటి ఆనందరావు, చింతల కిషోర్, కొమ్మిన రాము, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



ముసునూరులో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - ముసునూరు

ఈనెల 19వ తేదీన జరగనున్న బై ఎలక్షన్స్ దృష్టిలో పెట్టుకుని ముసునూరు మండలంలోని పోలింగ్ కేంద్రాలను నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పరిశీలించారు. ఆదివారం మండలంలోని చిల్లబోయినపల్లి గ్రామంలోని 107, 108 పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ దాసరి సుధా, ఇఒపిఆర్‌డి బసవరాజు సత్యనారాయణ, పోలింగ్ సూపర్ వైజర్లు, బిఎల్ఒల ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, వారికి పలు సూచనలు, సలహాలు చేశారు.

ఆగిరిపల్లి: మండల పరిధిలో ఈనెల 19న జరగనున్న అడవినెక్కలం గ్రామ సర్పంచి ఉపఎన్నికకు సంబంధించి పోలింగ్ కేంద్రమైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని బందోబస్తు ఏర్పాట్లను ఆదివారం ఉన్నతాధికారుల ఆదేశానుసారం ఆగిరిపల్లి ఎస్ఐ ఎన్.చంటిబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఉప ఎన్నికలు నిర్వహించేందుకు పటిష్ట చర్యలు చేపట్టడం జరుగుతుందని, ఈ ప్రాంతానికి చెందిన రౌడీషీటర్లను, చెడు నడత కల్గిన వ్యక్తులను, ఎన్నికల్లో నేర చరిత్ర కలిగిన వారిని ముందుస్తుగానే బైండోవర్ చేయటం జరిగిందని, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఆయన కోరారు.

మస్తాన్ వలీ సేవలు ప్రశంసనీయం : ఎంఎల్‌సి సాబ్జీ

ఏలూరు అర్బన్: పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో సుదీర్ఘకాలం పనిచేసి, ప్రజలకు విశిష్ట సేవలు అందించి అందరి మన్నలను పొందిన వ్యక్తి మస్తాన్ వలి అని ఎంఎల్‌సి షేక్ సాబ్జీ కొనియాడారు. గోపన్నపాలెం బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన షేక్ మస్తాన్ వలి ఉద్యోగ విరమణ కార్యక్రమం స్థానిక ఎఆర్‌డిజికె మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మస్తాన్ వలికు పుష్పగుచ్చాన్ని అందించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. సభలో ఎంఎల్‌సి సాబ్జీ మాట్లాడుతూ మస్తాన్ వలీ సేవలను ప్రశంసించారు. అనంతరం మస్తాన్ వలీ మాట్లాడుతూ తన సర్వీసులో సహకరించిన సిబ్బందికి, అధికారులకి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది, రిటైర్డ్ తెలుగు పండిట్ ఫజుల్ రెహమాన్, హసన్ ఆలీ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

తెలంగాణ మద్యం పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని తాటియాకుల గూడెం ఎస్ఇబి అంతరాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద ఆదివారం ఎస్ఇబిఎస్ఐ క్రాంతి కిరణ్ అధ్వర్యంలో వాహనాల తనిఖీలో అక్రమంగా తరలిస్తున్న 30 మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఆంధ్రాకు ఆటోలో తరలిస్తున్న 30 మద్యం బాటిళ్లను పట్టుకోవడం జరిగిందని ఎస్ఐ క్రాంతి కిరణ్ తెలిపారు. పట్టుకున్న మద్యాన్ని, ఆటోను సీజ్ చేసి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు. మద్యాన్ని, ఆటోను జంగారెడ్డిగూడెం ఎస్ఇబి స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

అమ్మఒడికి ఎదురుచూపులు..

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడికి చెందిన అమ్మఒడి లబ్ధిదారులు ఈ నాలుగో విడత అమ్మఒడిలో రూ.13 వేలకు గాను రూ.2 వేలు మాత్రమే జమయ్యాయి. ప్రగడవరానికి చెందిన అభిరామ్ తల్లి రెండు నెలలు క్రితమే ఆధార్ అప్‌డేట్ చేయించినా, మరలా అప్‌డేట్ అవ్వలేదనే నెపంతో ఇప్పటికీ రూ.13 వేలు జమకాలేని పరిస్థితి నెలకొంది. ఇలా మండలంలో ఆధార్ అప్‌డేట్ కాలేదని, బ్యాంక్ లింక్ కాలేదని, ఫోన్ నెంబరు లింక్ అవ్వలేదని ఏదోక కారణంలో చింతలపూడి మండలంలో 140 మంది లబ్ధిదారులు మిగిలిపోయారు. ఇప్పుడు వారంతా ఆధార్ కార్డులు అప్‌డేట్ చేయించినా, అధికారులు పడతాయని చెబుతున్నా, పడే వరకూ సందేహమేనని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అమ్మఒడి నాలుగోవిడత నగదు తల్లులు అకౌంట్‌లో ఇంకా జమకాని వారి పరిస్థితి ఏంటని లబ్ధిదారులు అడుగుతున్నారు. జూన్ 26వ తేదీన తల్లులు ఖాతాలోకి నేరుగా అమౌంట్ పడ్డాయి. గత మూడు విడతల్లో ఒకేసారి ఆలస్యమైనా నగదు మొత్తం జమ అయ్యేవని, నాలుగో విడతలో కొంత మందికి రూ.2వేలు, కొంతమందికి రూ.6వేలు, కొంతమందికి రూ.8వేలు నగదు జమయ్యాయి. మొదట రూ.15వేలు అమ్మఒడి పడిన తరువాత రెండు, మూడు విడతల్లో సంవత్సరానికి రూ.వెయ్యి చొప్పున స్కూల్ అభివృద్ధికి కేటాయిస్తున్నామని రూ.13వేలు ఖాతాల్లోకి జమచేస్తున్నారు. ఇప్పుడు ఆ రూ.13వేలు కూడా కొంతమంది అకౌంట్‌లో జమ అవ్వడం లేదని వారు చెబుతున్నారు.

చింతలపూడి మండలంలో ఇంకా అమ్మఒడి జమకాలేని వారు 140 మంది ఉన్నారు. లింగపాలెం మండలంలో 138, కామవరపుకోట 83 మంది ఉన్నారు. జిల్లా మొత్తం మీద 2,752 మంది ఉన్నారు. ఇందులో ఆధార్ అప్‌డేట్ అవ్వలేదని, ఆధార్ మ్యాపింగ్ అవ్వలేదని, అకౌంట్ లింక్ అవ్వలేదని రకరకాల కారణాలతో వీరి అకౌంట్‌లో నగదు జమకాలేని పరిస్థితి. అధికారులు నగదు పడతాయని చెబుతున్నా మళ్లీ వీరి కోసం బడ్జెట్ కేటాయిస్తారని సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ సంవత్సరం ఎప్పటికప్పుడు ఆధార్ లింక్, ఫోన్ నెంబరు లింక్, మ్యాపింగ్ చేయిస్తున్నా మళ్లీ ఇవే కారణాలతో అమ్మఒడి పడకపోవటంతో కొంతమంది అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అందరికీ అమ్మఒడి జమవుతుంది

రామరావు, ఎంఇఒ, చితలపూడి

అమ్మఒడి జమ కానివారందరకీ సమాచారం అందించాం. ఫోన్ చేశాం. లబ్ధిదారులు డేటా ఉన్నతాధికారులకు పంపిస్తాం. అందరికీ అమ్మఒడి నగదు జమ అవుతుంది. ఎవరూ కంగారు పడాల్సిన పనిలేదు.

గణేష్ అంజనా సాయి ఎంపిక హర్షణీయం

ప్రజాశక్తి - టి.నరసాపురం



గణేష్ అంజనాసాయి

మండలంలోని అప్పలరాజు గూడెం గురుకుల పాఠశాలలో చదివిన విద్యార్థి గణేష్ అంజనాసాయి అమెరికా పర్యటనకు ఎంపిక కావడం హర్షణీయమని పాఠశాల ప్రిన్సిపల్ డిఎస్‌బి శంకరరావు ఆదివారం తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో పాఠశాలలో విద్యనభ్యసించిన గణేష్ అంజనాసాయి 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 581 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరచినట్లు ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందన్నారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల నుంచి 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 52 మందిని ఎంపిక చేసి, వారిని వివిధ దశలలో పరీక్షించి, పది మందిని మాత్రమే అమెరికా పర్యటనకు ఎంపిక చేశారన్నారు. ఆ పదిమంది విద్యార్థుల్లో గణేష్ అంజనాసాయి ఎంపికయ్యారని తెలిపారు. యూఎస్ఎ ప్రోగ్రాంకు వెళ్లిన వారు తొమ్మిది రోజులు పాటు అమెరికాలో వివిధ విషయాలు పరిశీలించి వచ్చేందుకు వెళుతున్నట్లు ఆయన తెలిపారు. గణేష్ అంజనాసాయి భవిష్యత్తులో ఉత్తమ ప్రతిభ కనబరిచి, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు.

స్వాతంత్ర్య వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

ఏలూరు: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏలూరు రెవిన్యూ డివిజినల్ అధికారి కె.పెంచల్ కిషోర్ తెలిపారు. స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను ఆదివారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ పెంచల్ కిషోర్ మాట్లాడుతూ ఆగష్టు 15వ తేదీ మంగళవారం ఏలూరులోని పోలీసు పెరేడ్ గ్రౌండ్స్‌లో ఉదయం 9 గంటలకు 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. ఈ వేడుకలలో ముఖ్య అతిథిగా జిల్లా ఇంఛార్జి మంత్రివర్యులు పినిపే విశ్వరూప్ పాల్గొంటారన్నారు. ఏర్పాట్లలో భాగంగా విఐపి గేలరీ, వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటుచేయనున్న స్టాల్స్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించనున్న సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి ఆర్.విజయరాజు, ఏలూరు తహశీల్దార్ బి.సోమశేఖర్ పాల్గొన్నారు.

వికలాంగులకు అజీమ్ ఛారిటీ చేయూత

ప్రజాశక్తి - చింతలపూడి



వికలాంగులకు నిత్యావసరాలు అందిస్తూ..

తల్లిదండ్రులు పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండాలనీ, తల్లిదండ్రులు చనిపోయినా వారి పేరిట సమాజ సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని చింతలపూడి సిఐ ఎంవిఎస్ మల్లేశ్వరరావు అన్నారు. ఆదివారం చింతలపూడి మసీదు ఆవరణలో అజీమ్ ఛారిటీ తరుపున ఛారిటీ ఫౌండర్ ఎస్‌కె ఆజాద్ ఇద్దరు వికలాంగులకు ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులను ఎస్ఐ ప్రసాద్ చేతుల మీదుగా అందించారు. పాత చింతలపూడికి చెందిన వికలాంగుడు అజీజ్‌కు రూ.5వేలు ఆర్థికసాయం, షేక్ ఖాసిం అనే వికలాంగుడుకు బియ్యం, నిత్యావసర సరుకులను సీఐ మల్లేశ్వరరావు, ఎస్ఐ ప్రసాద్‌లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతికి ఉన్నప్పుడు తల్లిదండ్రులను చూడని సమాజంలో, తన తండ్రి అజీమ్ మరణించినా ఆయన పేరిట సమాజ సేవా కార్యక్రమాలు ఛారిటీ ఫౌండర్ అజాద్ చేయడం అభినందనీయం, ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు సయ్యద్ రహీమ్, కార్యదర్శి ఎండి జిలానీ, జమాత్ పెద్దలు ఎండి అక్బర్ అలి, ముస్లీం పెద్దలు ఎంఎ రజాక్, ఖాజా, హాజీ, రబ్బానీ, రఫీ, అల్లా బక్షు, ఇమ్రాన్, ఇమ్మాజి, ఇశాక్, అమీర్ పాషా, లయన్ క్లబ్ అధ్యక్షుడు జి.రాజేష్ నాయుడు పాల్గొన్నారు.

తక్కువ వడ్డీతో అధిక రుణం

ప్రజాశక్తి - ముసునూరు

తక్కువ వడ్డీతో భూమిని బట్టి ఎంతో మందికి రుణసౌకర్యం కల్పిస్తున్న బ్యాంకు కెడిసిసి బ్యాంక్ అని ముసునూరు మండల కెడిసిసి బ్యాంక్ మేనేజరు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ మండల కేంద్రమైన ముసునూరులో కెడిసిసి బ్యాంక్ పరిధిలో ముసునూరు, కాట్రేనీపాడు, చక్కపల్లి, చింతలవల్లి, కోర్లగుంట, గోపవరం, వలసపల్లి గ్రామాల్లో ప్రభుత్వం సొసైటీ కేంద్రాల్లో ఆయా గ్రామాల పరిధిలోని పలు గ్రామాలతో కలుపుకుని, వ్యవసాయ భూములకు స్వల్పకాలిక రుణాలైనా(మధ్య కాలపు రుణాలు) అందిస్తున్నట్లు తెలిపారు. క్రాఫ్‌లోన్లు, దీర్ఘకాలపు రుణాలైన ఎల్‌టిలోన్లు, కర్షక మిత్ర, రైతు నేస్తం, ట్రాక్టర్లు, ఎద్దు బండి రుణాలు, పశు రుణాలైనా గొర్రెల పెంపకం, మేకల పెంపకం, గేదల పెంపకం ఇలా రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మండల పరిధిలోని ఏడు సొసైటీ పరిధిలో కొన్ని వందల కోట్ల రుపాయలు టర్నోవర్ అవుతుందన్నారు. వ్యవసాయ అనుబంధ రుణసౌకర్యంతో వ్యాపార అభివృద్ధికి కూడా లోన్లు మంజూరు చేసి నెల, త్రైమాసిక, ఆరుమాసాలకు, సంవత్సరానికి ఒకసారి ఇలా వడ్డీతో పాటు అసలులోని కొంత నగదు బ్యాంక్‌లో జమ చేయాలని తెలియజేశారు.

రైతులకు సాగునీరు అందించడం హర్షణీయం..

ప్రజాశక్తి - దెందులూరు

కృష్ణా, గోదావరి డెల్టాల శివారు ప్రాంత ఆయకట్టుకు సాగునీరు అందక ఎండిపోతున్న పంటలకు సాగునీరు అందించడం పట్ల ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. పట్టిసీమ కాలువ ద్వారా వస్తున్న నీటిని దెందులూరు మండలంలోని సత్యనారాయణపురం వద్ద గుండేరుపై అడ్డుకట్టవేసి గోదావరి, ఏలూరు కాలువకు సాగునీటిని మళ్లిస్తున్న ప్రాంతాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ గత 15 రోజులుగా గోదావరి, కృష్ణా డెల్టాల శివారు ప్రాంత భూములకు సాగునీరు అందక నాట్లు వేసిన చేలు బీటలు వారి, ఇంకా నాట్లు వేయాల్సిన భూములలో సాగునీరు నాట్లు వేయలేక అన్నదాతలు ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. ఈ పరిస్థితులలో దెందులూరు ఎంఎల్ఎ, అధికారులు స్పందించి సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టడం వలన సాగునీటి సమస్య పరిష్కారమైందన్నారు. ఖరీఫ్ సాగుకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో అధికారులు వ్యవహరించాలని కోరారు. పోణంగి పుంత కాలువ ద్వారా ఏలూరు మండలంలో శివారు ప్రాంత భూములకు సాగునీరు అందేలా చూడాలన్నారు. పంట కాలువల్లో గుర్రపు డెక్క, తూడు, పూడికతీత పనులు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి సున్నా వెంకట్రావు, నాయకులు కొల్లి విజయ భాస్కర రెడ్డి పాల్గొన్నారు.

కష్టాల.. ఖరీఫ్..!

సెంటునారు రూ.3వేలు

భారీ వర్షాలకు కుళ్లిన వరిపైరు

అదనపు ఖర్చుతో రైతులు ఆందోళన

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఖరీఫ్ సాగు ఆరంభం నుంచి కౌలు రైతులను ఖరీఫ్ కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. గత మూడు నెలలుగా రైతు ఖరీఫ్ సాగుతో అనేక ఇక్కట్లు పడుతున్నాడు. గత మే నెల నుంచి ఆగష్టు నెల వరకూ ఈమధ్య కాలంలో రైతులు మూడు దఫాలుగా విత్తనాలు వెదజల్లడం, రెండు సార్లు నాట్లు వేయడం జరిగింది. మే నెలలో వర్షాభావం కారణంగా అధిక ఎండలకు వెదజల్లిన విత్తనాలు పొట్లుపోయి విత్తనాలు మొలకెత్తలేదు. దీంతో జూన్ నెలాఖరిలో మరోమారు రైతులు చేలో దుక్కులు వేసి విత్తనాలు వెదజల్లారు. మరికొన్ని గ్రామాల్లో రైతులు వరినాట్లు వేశారు. గత జూలై నెల చివరి వారంలో కురిసిన భారీ వర్షాలకు వెదజల్లిన, నాట్లు వేసిన పంట పొలాలు పూర్తిగా ముంపుకు గురికావడంతో, రెండోసారి తిరిగి నాట్లు వేసేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. భారీ వర్షాలకు మండలంలో వేలాది ఎకరాల్లో వెదజల్లిన చేలు, నారుమడులు, నాట్లు వేసిన చేలు పనికి రాకుండా పోయాయి. దీంతో దిక్కుతోచని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. దీంతో చేసేది లేక మరోమారు మళ్లీ నాట్లు వేసేందుకు దూరప్రాంతాల నుంచి అధిక ధరకు నారును కొనుగోలు చేసి, మళ్లీ నాట్లు వేసే పనుల్లో రైతన్నలు నిమగ్నమయ్యారు. ఇప్పటికే ఎకరాకు రూ.25వేలు వరకూ ఖర్చు చేసిన రైతులు మూడోసారి విత్తనాలు వెదజల్లేందుకు, రెండోసారి తిరిగి మళ్లీ నాట్లు వేసేందుకు అధిక వ్యయం ఖర్చు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

గత నెలలో భారీ వర్షాలకు వేలాది ఎకరాల్లో వరి పైరు నీట మునిగింది. మండలంతో పాటు పక్క కృష్ణజిల్లాలో కూడా భారీగా చేలు నీట మునిగాయి. దీంతో వెదజల్లిన, నాట్లు వేసిన చేలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ పరిస్థితిలో మళ్లీ నాట్లు వేయాలంటే రైతులకు తలకు మించిన భారంగా మారింది. అయినా చేసేదిలేక, రైతు పోయిన చేలు ఖాళీగా ఉంచలేక, నాట్లు వేసేందుకు రైతు అప్పులు చేసి పరుగులు పెడుతున్నాడు.

మండలంలో నారు దొరకకపోవడంతో పక్క జిల్లాలైన కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి నారు కొనుగోలు చేస్తున్నారు. దీంతో నారుకు బాగా డిమాండ్ ఏర్పడింది. నారు కొరతను బట్టి సెంటు నారు రూ.2,500 నుంచి రూ.3వేలు ధర పలుకుతోంది. ధర ఎక్కువగా ఉన్నా చేసేదిలేక, చేను ఖాళీగా ఉంచలేక నాట్లు వేస్తున్నారు. వెదజల్లిన చేల్లో పైరు కుళ్లిపోవడంతో, సార్వా విత్తనాలు సాగు చేసిన చేల్లో సమయం మించిపోవడంతో చేసేది లేక దాళ్వా విత్తనాలను రైతులు వెదజల్లుతున్నారు. దీంతో రేపు పంట చేతికి వచ్చినప్పుడు ఎరుపు, తెలుపు రెండు రకాలుగా విత్తనాలు వస్తాయంటున్నారు. అయినా రైతులు ఇబ్బందులు దృష్ట్యా నిబంధనలు సడలించి ప్రభుత్వం వీటిని కూడా కొనుగోలు చేయాలని రైతులు ముందస్తు కోరుతున్నారు. మండల వ్యాప్తంగా 15వేల ఎకరాల్లో సార్వా సాగు చేపట్టగా, మూడొంతులు మేర భారీ వర్షాలకు వరిపైరు ముంపుకు గురైంది. ఖరీఫ్‌లో ప్రకృతి కన్నెర చేయడంతో ఈ సీజన్‌లో కౌలు రైతుపై ఆర్థిక భారంగా, అధికంగా పడిందని పలువురు రైతులు చెబుతున్నారు.



ముంపుకు గురైన చేల్లో మళ్లీ నాట్లు వేస్తున్న కూలీలు

కళాశాల అభివృద్ధికి కృషి : ఎంపీ



అరవిందుల విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎంపి, ఎంఎల్ఎ



జాతీయ జెండాలతో ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

'నాన్న పేరు పక్కన నా పేరు ఉండేలా నారాయణపురం కాలేజీ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తా' అని ఏలూరు పార్లమెంటరీ సభ్యుడు కోటగిరి శ్రీధర్ అన్నారు. నారాయణరం శ్రీఅరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ డైమెంట్ జూబ్లీ ఉత్సవాలు, 1972-2023 బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనంలో ఈనెల 12, 13 తేదీల్లో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ఆదివారం ముఖ్య అతిథిగా ఎంపీ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు మానాన్న మాజీ మంత్రి కోటగిరి విద్యాధరరావు ఈ కళాశాల అభివృద్ధికి చేసిన కృషికి రెట్టింపు స్థాయిలో తన వంతు కాలేజీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. ముందుగా పూర్వ విద్యార్థి కోనా శ్రీనివాసరావు ఆర్థిక సాయంతో నెలకొల్పిన శ్రీఅరవిందుల విగ్రహాన్ని ఎంపీ ఆవిష్కరించారు. సభకు పూర్వవిద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షుడు ఈపూరి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు మాట్లాడుతూ ఈ కాలేజీలో క్రీడా మైదానానికి గతంలో మంజూరైన నిధులతో సగంలోను పని ఆగి పోయిన నిర్మాణాలపై తన వంతు కృషి చేస్తానన్నారు. ఇదే కాలేజీలో చదివి గన్నవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఉంగుటూరు మండలం అప్పారావుపేటకు చెందిన పి.కనకారావు స్వర్ణోత్సవాల పైలాన్ నిర్మాణానికి రూ.50 వేలు విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా సీఐ కనకారావు మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దిన కళాశాల రుణాన్ని తీర్చుకునే అవకాశం ఈవిధంగా రావడం సంతోషంగా ఉందన్నారు. రిటైర్డ్ ప్రిన్సిపల్స్ జి.వెంకటేశ్వరరావు, సూరి శ్యామ్‌ప్రసాద్, బోటనీ అధ్యాపకులు కృష్ణారెడ్డి, తెలుగు అధ్యాపకురాలు వావిలాల ఝాన్సీ, అధ్యాపకులు రామరాజు, లైబ్రేరియన్ ఝాన్సీ రాణి, ఆనాడు కీర్తిశేషులు చింతలపాటి మూర్తిరాజుకు సహాయ సహకారాలు అందిస్తూ కాలేజీ అభివృద్ధికి కృషిచేసిన కొండ్రెడ్డి సర్వేశ్వరరావులను పూర్వ విద్యార్థులు సత్కరించారు. దూర ప్రాంతాల నుంచి పూర్వవిద్యార్థులు రావడంతో కళాశాలలో పండుగ వాతావరణాన్ని తలపించిందని సంతోషం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న ఏలూరు ఎంపి కోటగిరి శ్రీధర్

150 అడుగుల జాతీయ జెండాతో ఊరేగింపు ప్రదర్శన

ఆజాదీకా అమృత మహోత్సవాలను పురస్కరించుకుని 150 అడుగుల జాతీయ జెండాలతో పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు, గ్రామస్తులు ప్రదర్శన నిర్వహించారు. కళాశాల అభివృద్ధికి పలువురు పూర్వవిద్యార్థులు ఆర్థిక వితరణలను ప్రకటించారు. మరికొంత మంది సాయాన్ని కళాశాల అభివృద్ధి కమిటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థుల సంఘం కార్యదర్శి బొమ్మిడి అప్పారావు, ఆదిరెడ్డి సత్యనారాయణ, సిపిడిసి సభ్యులు సాగిరాజు జానకి రామరాజు, కళాశాల ప్రిన్సిపల్ విశ్వేశ్వరరావు, జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ బివి శ్రీనివాస్, జడ్‌పిటిసి సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, వైసిపి మండల కన్వీనర్ మరడ మంగారావు, వివిధ కమిటీ సభ్యులు సిరిమామిళ్ల పెద్దిరాజు, కొరపాటి హరికృష్ణ, శీతాల సత్యనారాయణ, కలిగట్ల శ్రీరామకృష్ణ పాల్గొన్నారు.

జనసేన గెలుపునకు.. కాలినడకన శ్రీవారి సన్నిధికి

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

జనసేన విజయం పొందాలని ప్రతీ ఆదివారం కామవరపుకోటకు చెందిన వీరంకి గగన్ గౌడ్ కామరపు కోట నుంచి ద్వారకాతిరుమల వరకూ పది కిలోమీటర్లు కాలినడకన వెళుతున్నారు. జనసేన జెండా పట్టుకుని కాలినడకన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సన్నిధికి వచ్చి గెలుపు కోసం స్వామివారి ఆశీర్వాదాలు తీసుకుని తిరుగు ప్రయాణం చేయడం జరుగుతుందని తెలియపరిచారు. ఎన్నికలు పూర్తయ్యే వరకూ ప్రతీ ఆదివారం ఇలానే వచ్చి, మొక్కుబడి చెల్లించుకోవడం జరుగుతుందని వీరంకి గగన్ గౌడ్ తెలిపారు. జన సముద్రం ప్రింట్ మీడియాతో మాట్లాడటం, అనేక విషయాలు తెలియపరచడం జరిగింది. ఈ సందర్భంగా వీరంకి గౌడ్ మాట్లాడుతూ అమ్మ రాజ్యలక్ష్మి గౌడ్‌ను వెంటబెట్టుకుని ఏలూరు, భీమవరం వారాహి ర్యాలీలో పాల్గొన్నామని తెలిపారు. పవన్ కళ్యాణ్ అంటే తనకు ఆరాధ్య దైవమని తెలిపారు. కామవరపు కోటలో సాయిరాం హోమ్ నీడ్స్‌లో సేల్స్ చేస్తూ ఉంటానని తెలియజేశారు.

టిడిపిలోకి పలువురు

ప్రజాశక్తి - పోలవరం

లక్ష్మీనారాయణదేవి పేట గ్రామంలో గ్రామ కమిటీ అధ్యక్షులు ఇళ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో బొరగం శ్రీనివాసులు అధ్యక్షతన సుమారు 100 కుటుంబాలు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా బొరగం శ్రీనివాసులు మాట్లాడుతూ టిడిపిలో ప్రతిఒక్కరికి గుర్తింపు ఉంటుందని, అందరికీ సముచిత స్థానం కల్పించబడుతుందని తెలిపారు. రాబోయే రోజుల్లో యువత రాజకీయాల్లో ముందుకు వచ్చి రాష్ట్రాన్ని బాగు చేసుకోవాల్సిన బాధ్యత ఉందని తెలియజేశారు. యువకులందరికీ కండువా కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు ఇళ్ళ సత్యనారాయణ, ఉపాధ్యక్షులు దాసరి రవి, నాగబాబు, సాయి వెంకటేష్ పాల్గొన్నారు.